
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
ఆదివారం 23 జూన్ 2024



## సంప్రదాయాలు పాటించని జగన్

» మాజీ ఎమ్మెల్సీ బుద్ద

తుమ్మపాల, జూన్ 22: సభా సంప్రదాయాలు పాటిస్తానని ప్రమాణం చేసి 24 గంటలు గడవక ముందే వాటికి తిలోదకాలిచ్చి సభకు గైర్హాజరు కావడం జగన్ మోహన్‌రెడ్డికే చెల్లిందని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన అయ్యన్నపాత్రుడును స్పీకర్‌గా ఎన్నుకోవడంతో జగన్‌రెడ్డి ఓర్వ లేకపోయారన్నారు. బీసీల పట్ల జగన్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదన్నారు. వివిధ వర్గాలకు 56 కార్పొరేషన్లు పెట్టి వారికి నిధులు ఇవ్వకుండా పెత్తందారీ పాలన కొనసాగించారన్నారు.



స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన అయ్యన్నకు చిత్రపటం అందజేస్తున్న దృశ్యం, పక్కన ఆయన సతీమణి పద్మావతి.

# శాసనసభాపతిగా అయ్యన్న

నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం

- పది సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఏడు సార్లు గెలుపు
- ఐదు పర్యాయాలు మంత్రిగా సేవలు
- ఒకసారి అనకాపల్లి ఎంపీగా విజయం

నర్సీపట్నం, జూన్ 22:

**టీడీపీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గం ఎమ్మెల్యే సీహెచ్ అయ్యన్నపాత్రుడు ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతిగా శనివారం బాధ్యతలు చేపట్టడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. శాసనసభ ప్రొటెం స్పీకర్‌గా ఉన్న గోరంట్ల బుచ్చయ్య చౌదరి.. స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అధికారికంగా ప్రకటించడంతో పార్టీ నాయకులు, అభిమానులు ఆనందంతో ఉప్పొంగి పోయారు.**

ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి స్పీకర్ పదవి చేపట్టిన తొలి ఎమ్మెల్యేగా అయ్యన్నపాత్రుడు రికార్డు సృష్టించారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఆయనకు ఉంది. ఒకే పార్టీలో ఉంటూ, ఒకే నియోజకవర్గం నుంచి పది సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఘనత సాధించారు. ఏడు సార్లు శాసన సభ్యునిగా నర్సీపట్నం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. ఎన్టీ రామారావు, చంద్రబాబు క్యాబినెట్‌లో ఐదు పర్యాయాలు మంత్రిగా పని చేశారు.

# అమర్ అక్రమ నిర్మాణం

నాడు వైసీపీ మంత్రిగా అధికార దుర్వినియోగం

- జీవీఎంసీ అనుమతి లేకుండానే వాణిజ్య సముదాయం నిర్మాణం
- జాతీయ రహదారిని ఆనుకుని జీ+4 భవనం
- సెట్‌బ్యాక్‌లు విడిచిపెట్టకుండానే... నోటీసులు జారీచేసినా బేఖాతరు
- జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి
- మంత్రిగా ఉండడంతో చర్యలకు వెనుకాడిన అధికారులు



గాజువాకలో జాతీయ రహదారిని ఆనుకుని ప్లాన్ లేకుండానే నిర్మించిన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ షాపింగ్‌మాల్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ పాలనలో గుడివాడ అమర్‌నాథ్ మంత్రిగా ఒరగబెట్టిందేమీ లేకపోయినా ఆయన ఎక్కడకు వెళ్లినా హడావుడి మాత్రం తక్కువేం లేదు!. మంత్రి కావడంతో అధికారులు సైతం ఆయన ఆదేశాలకు 'జీ హుజూర్' అంటూ సాగిలపడిపోయేవారు. దీన్ని ఆసరాగా తీసుకుని పారిశ్రామిక ప్రాంతంగా గుర్తింపు పొందిన గాజువాకలో అమర్ జాతీయ రహదారికి ఆనుకుని అడ్డగోలుగా ఐదంతస్థుల షాపింగ్‌మాల్‌ను నిర్మించేశారు. జీవీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే భవన నిర్మాణం పూర్తి చేసేశారు. దీనికి సమీపంలోనే ప్రస్తుత టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌కు చెందిన భవనాన్ని వైసీపీ హయాంలో నిబంధనల పేరిట కూలగొట్టిన అధికారులు...ఇప్పుడు గుడివాడ అమర్ భవనం విషయంలో ఎందుకు ఉపేక్షిస్తున్నారంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు.

### అధికారం అండతో అడ్డగోలుగా నిర్మాణం

గాజువాకలోని చట్టివానిపాలెం వద్ద హైవేను ఆనుకుని అమర్‌నాథ్‌కు సుమారు 400 గజాల స్థలం ఉంది. అందులో వాణిజ్య సముదాయం నిర్మాణం కోసం అనుమతి కోరుతూ జీవీఎంసీకి రెండేళ్ల కిందట ఆన్‌లైన్‌లో ప్లాన్‌కు దరఖాస్తు చేశారు. దరఖాస్తు ఫీజు కింద రూ.పది వేలు చెల్లించారు. అయితే భవన నిర్మాణ కోసం ప్రతిపాదించిన స్థలం జాతీయ రహదారికి ఆనుకుని ఉంది. ఆ రహదారిని భవిష్యత్తులో 80 మీటర్లకు విస్తరించాలని మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచారు. మాస్టర్‌ప్లాన్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణకు సర్వే నిర్వహించి ఇరువైపుల ఎంతవరకూ భూమి అవసరమవుతోందో గుర్తించి జీవీఎంసీ అధికారులు ఆర్‌డీపీ (రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్) ఇవ్వాలి. ఒకవేళ ప్రైవేటు స్థలం కూడా రహదారి విస్తరణకు అవసరమని తేలితే ఆ మేరకు జీవీఎంసీ స్వాధీనం చేసుకుని, పరిహారంగా యజమానికి టీడీఆర్ ఇస్తుంది. ఆ ప్రక్రియ పూర్తికాకపోవడంతో మాజీ మంత్రి అమర్‌నాథ్ భవన నిర్మాణం కోసం చేసుకున్న దరఖాస్తు ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉండిపోయింది. అయినప్పటికీ అధికారం అండతో మంత్రి భవన నిర్మాణం ప్రారంభించేశారు. పైగా నిర్మాణంలో సెట్‌బ్యాక్‌లు కనీసం విడిచిపెట్టలేదు. జాతీయ రహదారిని మాస్టర్‌ప్లాన్ ప్రకారం విస్తరిస్తే ఇప్పుడున్న రోడ్డుకు ఇరువైపులా కనీసం 15 అడుగులు వరకూ వెడల్పు పెరుగుతుంది. అక్కడి నుంచి రోడ్డు వైపు భవనం ముందుభాగంలో 20 అడుగులు సెట్‌బ్యాక్ కింద విడిచిపెట్టాలి. అయితే కనీసం ఐదు అడుగులు కూడా విడిచిపెట్టలేదు. అదేవిధంగా మూడువైపులా మూడు మీటర్లు చొప్పున సెట్‌బ్యాక్ కింద వదలాలి. ఒక మీటరు కూడా సెట్‌బ్యాక్ విడిచిపెట్టలేదు. పైగా భవనానికి పశ్చిమ వైపు నుంచి చట్టివానిపాలెం గ్రామంలోకి వెళ్లేందుకు ఐదు అడుగుల రోడ్డు ఉంది. దీన్ని కూడా భవిష్యత్తులో 30 అడుగులకు విస్తరించే ప్రతిపాదన ఉండడంతో అటు వైపు కూడా పది అడుగులు విడిచిపెట్టి తర్వాత భవనం నిర్మించాల్సి ఉన్నప్పటికీ ఆ రోడ్డును అంటిపెట్టుకుని భవన నిర్మాణం చేసేశారు. ఆగమేఘాల మీద భవన నిర్మాణం పూర్తిచేసి ఎన్నికలకు ముందు అందులో పార్టీ కార్యాలయం ప్రారంభించేశారు.

### టౌన్‌ప్లానింగ్ అధికారుల నోటీసులిచ్చినా బేఖాతరు

ప్లాన్ లేకుండా భవన నిర్మాణం చేయడంతోపాటు సెట్‌బ్యాక్ నిబంధనలు ఉల్లఘించారని, అదనపు అంతస్తులు నిర్మించారంటూ గాజువాక జోన్ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీచేశారు. దీనిపై మంత్రి హోదాలో ఉన్న అమర్‌నాథ్ నేరుగా జీవీఎంసీ కీలక అధికారికి ఫోన్ చేశారు. దీంతో కీలక అధికారి గాజువాక టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫోన్ చేసి అటువైపు కన్నెత్తి చూడద్దొంటూ హుకుం జారీచేయడంతో వారంతా మిన్నకుండిపోవాల్సి వచ్చింది. తాజాగా వైసీపీ అధికారం కోల్పోవడం, అమర్‌నాథ్ కూడా గాజువాక నుంచి పోటీ చేసి ఓడిపోవడంతో అక్రమ భవన నిర్మాణం అంశం బయటపడింది. ఇదిలావుండగా, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నిరకాల నిబంధనలను పాటిస్తూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తుండగా, జాతీయ రహదారి విస్తరణకు రూపొందించిన మాస్టర్‌ప్లాన్ ప్రకారం రెండడుగులు ముందుకువచ్చి భవనం నిర్మించారంటూ జీవీఎంసీ అధికారులు వైసీపీ ప్రభుత్వ హయాంలో యంత్రాలతో నిర్మాణాన్ని నేలమట్టం చేశారు. దానికి కూతవేటు దూరంలోనే మాజీ మంత్రి అమర్‌నాథ్ నిర్మించిన అక్రమ భవనం ఉండడంతో జీవీఎంసీ అధికారులు ఇప్పుడు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

### జీవీఎంసీలోనే ప్లాన్ పెండింగ్: గుడివాడ అమర్‌నాథ్

చట్టివానిపాలెంలో మా తాతల ఆస్తిగా వచ్చిన 400 గజాల స్థలంలో భవన నిర్మాణానికి మూడేళ్ల కిందటే జీవీఎంసీకి ప్లాన్ కోసం దరఖాస్తు చేశాం. అన్ని ఫీజులు చెల్లించడంతోపాటు రోడ్డు విస్తరణకు స్థలం కూడా జీవీఎంసీ పేరిట రిజిస్ట్రేషన్ చేశాను. మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆర్‌డీపీ జరగలేదనే కారణంతో ప్లాన్‌ను జీవీఎంసీలో ఇంకా పెండింగ్‌లో ఉంచారు. నా వైపు నుంచి ప్రభుత్వానికి కట్టాల్సిన అన్నిరకాల పన్నులు చెల్లించేశాను.

# వెజి(ట్ర)బుల్!

మండిపోతున్న కూరగాయల ధరలు

- దడ పుట్టిస్తున్న టమాటా రేటు
- కన్నీళ్లు తెప్పిస్తున్న ఉల్లి
- రూ.60లు పలుకుతున్న ఇతర కూరగాయలు
- గగ్గోలు పెడుతున్న సామాన్య ప్రజలు



మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తున్న దుకాణం

కూరగాయలు ధరలు పట్టిక

| | గత వారం | ఈ వారం |
|---|---|---|
| అల్లం | రూ.160 | రూ.200 |
| టమాటా | రూ.50 | రూ. 80 |
| వంకాయలు | రూ. 40 | రూ.60 |
| దొండ | రూ.40 | రూ.60 |
| ఉల్లిపాయలు | రూ.40 | రూ.40 |
| బీరకాయలు | రూ.50 | రూ.60 |
| పచ్చిమిర్చి | రూ.60 | రూ.80-100 |
| బెండ | రూ.40 | రూ.60 |
| క్యాప్సికం | రూ.80 | రూ.100 |

నర్సీపట్నం, జూన్ 22: మార్కెట్లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. గత వారంతో పోలిస్తే ఈ వారం అన్ని రకాల కూరగాయల ధరలు పెరిగి పోయాయి. కొన్ని రకాల కూరగాయల ధరల్లో చాలా వ్యత్యాసం కనిపించింది.

సాధారణంగా ఎండా కాలంలో ధరలు పెరిగి వర్షాకాలంలో తగ్గడం చూస్తుంటాం. ఈ ఏడాది వర్షాలు మొదలైన తరువాత కూడా కూరగాయల ధరలు ఆకాశాన్ని తాగుతున్నాయి. అనుకున్న స్థాయిలో వర్షాలు పడకపోవడమే ధరలు పెరగడానికి కారణమని వ్యాపారులు అంటున్నారు. రెండు వారాల క్రితం వరకు మార్కెట్లో టమాటా ధర రూ.25లు ఉండేది. గత వారం రూ.50లకు పెరిగింది. ఈ వారం రూ.80లకు ఎగబాకింది. టమాటా ధర సామాన్యుల్లో దడ పుట్టిస్తుంది. టమాటా లేనిదే కూరలు రుచించవు. దీంతో ఎంత ధర ఉన్నా టమాటాలు కొనక తప్పడం లేదని ప్రజలు అంటున్నారు. వచ్చే వారం రూ.100లకు పెరిగినా ఆశ్చర్యం లేదని వ్యాపారులు అంటున్నారు. చిత్తూరు జిల్లా మదనపల్లిలో ఒక క్రేట్ రూ.1200 నుంచి రూ.1400లకు విక్రయిస్తున్నారు. గత వారం పచ్చిమిర్చి కిలో రూ.60లు ఉంటే ఈ వారం ఏకంగా రూ.80 నుంచి రూ.100లకు పెరిగింది. రెండు వారాల క్రితం వరకు ఉల్లిపాయలు రూ.25లు అమ్మేవారు. 10 రోజుల వ్యవధిలో రూ.40 పైగా ధర పలుకుతుంది. ఉల్లిపాయల ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు. మిగిలిన అన్ని రకాల కూరగాయల ధరలు కిలో రూ.60 నుంచి రూ.80లు విక్రయించారు. కూరగాయల రేట్లు చూసి సామాన్య ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

# విస్సన్నపేట భూదందాకు అడ్డుకట్ట పడేనా?

అధికారంలో ఉండగా చెలరేగిపోయిన వైసీపీ నేతలు

- ప్రభుత్వ భూములు ఆక్రమించి దర్జాగా లేఅవుట్ ఏర్పాటు
- టీడీపీ, జనసేన ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు
- కమిటీలు వేసి విచారణ చేపట్టినా బహిర్గతం కాని నివేదికలు
- మరోసారి ఫిర్యాదు చేసేందుకు జనసేన సన్నద్ధం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

**అనకాపల్లి నియోజకవర్గ పరిధి కశింకోట మండలం విస్సన్నపేటలో భూ దందాకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంత్రి అనుచరులు యథేచ్ఛగా సాగించిన భూ దోపిడీని అడ్డుకొనేందుకు గతంలో టీడీపీ, జనసేన నేతలు ఎన్ని ఫిర్యాదులు చేసినా స్థానిక రెవెన్యూ అధికారులు కనీసం పట్టించుకోలేదు.**

విచారణల పేరుతో అధికారులు కాలక్షేపం చేస్తూ పరోక్షంగా భూ ఆక్రమణదారులకు వంతపాడారు. సాక్షాత్తూ జనసేన అధినేత పవన్ కల్యాణ్



విస్సన్నపేట లేఅవుట్‌లోని స్థలం

విస్సన్నపేట భూముల ఆక్రమణలపై కేంద్ర ప్రభుత్వానికి అప్పట్లో ఫిర్యాదు చేశారు. కానీ ఎటువంటి స్పందన లేదు. తాజాగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విస్సన్నపేట భూ దోపిడీ వ్యవహారంపై విచారణ జరుగుతుందని అంతా భావిస్తున్నా, భూ ఆక్రమణదారులు యథేచ్ఛగా తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. కశింకోట మండలం బయ్యవరం రెవెన్యూ పరిధిలో రెవెన్యూ రికార్డుల ప్రకారం వందలాది ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయి. సర్వే నంబరు 195/2లో సుమారు 609.24 ఎకరాల భూములను వైసీపీ నేతలు తమ కబంధ హస్తాల్లో పెట్టుకున్నారు. ఇందులో కొంత మేర భూమి జిరాయితీ కాగా, సుమారు 300 ఎకరాలు ప్రభుత్వ బంజరు, డీపట్టా భూములు, కొండలు, వాగులు, గోర్జలు, పంట కాలువల భూములు కూడా ఉన్నాయి. రెవెన్యూ రికార్డుల ప్రకారం 195/2 సర్వే నంబరులో 49.66 ఎకరాలు రంగబోలు గెడ్డగా నమోదైంది. ఇందులో వందల ఎకరాలు కొంతమంది ఎస్సీ, ఎస్టీ తెగలకు చెందిన పేదలకు సాగు కోసం గతంలో ప్రభుత్వాలు పట్టాలు అందజేశాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ ఖాళీ భూములపై వైసీపీ నేతలు కన్నేశారు. అనుకున్నదే తడవుగా అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అనుచరులు రంగంలోకి దిగి భారీ రియల్ ఎస్టేట్ వెంచర్ వేసేందుకు సిద్ధమయ్యారు. మంత్రి అనుచరుడు, వైసీపీ జిల్లా ముఖ్య నేత ఆధ్వర్యంలో వింజేటి రిసార్ట్స్ పేరుతో రియల్టర్లను రంగంలోకి దించి వెంచర్ పనులు ప్రారంభించారు. ఎవరెన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోకుండా అధికారం ఉంది కదాని రియల్టర్లు పనులు కానిచేస్తున్నారు. వీఎంఆర్‌డీఏ అనుమతులు లేకుండానే కేవలం దరఖాస్తు చేసుకొని భారీ లేఅవుట్ పనులు చకచకా కానిచ్చేస్తున్నారు. వెడల్పు రోడ్డు పనులు పూర్తిచేసి, ఇప్పటికే ప్లాట్‌లుగా విభజించి అమ్మకాలు కూడా జరుపుతున్నట్టు సమాచారం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా విస్సన్నపేట భూ దందాకు అడ్డుకట్ట పడకపోగా, గతంలో విచారణ నివేదికలు బుట్టదాఖలు చేసిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోసారి విస్సన్నపేట భూముల ఆక్రమణ, అడ్డగోలు వ్యవహారంపై జనసేన నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నారు.

## ఈదురుగాలుల బీభత్సం



కుమారపురంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

పాయకరావుపేట రూరల్, జూన్ 22 : మండలంలో శనివారం తెల్లవారు జామున వీచిన ఈదురు గాలులకు కుమారపురంలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. బలమైన ఈదురు గాలులు వీచడంతో పాటు భారీ వర్షం పడడంతో గ్రామంలో పలు చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు.



## విశాఖ కలెక్టర్ బదిలీ

- సాధారణ పరిపాలనా విభాగంలో రిపోర్టు చేయాల్సిందిగా మల్లికార్జునకు ఆదేశాలు
- జాయింట్ కలెక్టర్‌కు తాత్కాలికంగా ఇన్‌చార్జి బాధ్యతలు



విశాఖపట్నం, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. నేరుగా సాధారణ పరిపాలనా విభాగంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులను బదిలీలు జరుగుతాయని వారం నుంచి చర్చ సాగుతుంది. నాలుగు రోజుల క్రితం సీనియర్ అధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం శనివారం కలెక్టర్లను బదిలీ చేసింది. ప్రస్తుతం విశాఖ కలెక్టర్‌గా ఎవరినీ నియమించలేదు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌కు తాత్కాలికంగా కలెక్టర్ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.



# గోతుల దారిలో వెళ్లేదెలా?

అధ్వానంగా ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి కింతలి వెళ్లే మార్గం

జంపెన వద్ద గోతులమయం

- వర్షం పడితే మడుగును తలపించేలా రోడ్డు
- పాదచారులు, వాహనచోదకులకు తప్పని అవస్థలు



గోతుల్లోంచే వెళుతున్న వాహనాలు

మాడుగుల రూరల్, జూన్ 22: అసలే గోతులు.. పైగా అందులో చేరిన వర్షపు నీరు. చెరువును తలపించే ఈ మార్గంలో రాకపోకలు సాగించడం సాహసంతో కూడిన పని. ప్రమాదమని తెలిసినా గత్యంతరం లేక ఇటుగానే ప్రయాణించాల్సి పరిస్థితి.. ఇదీ మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి కింతలి గ్రామం వెళ్లే రహదారి దుస్థితి.

మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి కింతలి గ్రామం వెళ్లే రోడ్డులో జంపెన గ్రామం వద్ద రోడ్డు గోతులతో అధ్వానంగా ఉంది. వర్షాలు పడితే ఈ గోతుల్లో నీరు నిలిచిపోయి మడుగును తలపిస్తున్నది. దీంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి కింతలి వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు 9.68 కిలోమీటర్లు ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది మార్చి నెలలో రూ.9 కోట్లతో ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి కింతలికి తారురోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అయితే గ్రామ సరిహద్దుల వరకు తారురోడ్డు వేసి మిగిలిన రోడ్డుపై సీసీ రోడ్డు వేసేందుకు గ్రామాల వద్ద పాత రోడ్డు తవ్వేసి చదును చేసి అలాగే వదిలేశారు. దీంతో వర్షాలు పడడం వల్ల పాత రోడ్డు కోతకు గురవ్వడంతో పాటు ఛిద్రంగా మారింది. ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి కింతలి గ్రామం మధ్యలో వాడపాడు, జంపెన, గాదిరాయి, వమ్మలి, జమ్మాదేవిపేటతో పాటు పలు గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాలవారు ఈ రోడ్డుపై ప్రయాణించి జంపెన, వాడపాడు మీదుగా ఘాట్‌రోడ్డు జంక్షన్‌కి చేరుకుని అక్కడ నుంచి మాడుగుల, ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. ఈ రోడ్డే వీరికి ప్రధానం. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, పలు వాహనాలపై వెళ్లే వారంతా ఈ గోతుల వద్దకు వచ్చేసరికి ఎక్కడ అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతామోనని భయపడిపోతున్నారు. పగటి వేళల్లో కంటే రాత్రి సమయాల్లో మరింత ప్రమాదకరంగా ఉందని వారంతా వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని కోరుతున్నారు. దీనిపై మాడుగుల ఆర్ అండ్ బీ జేఈ సాయిని వివరణ కోరగా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నామని, సీసీ రోడ్డు పనులు కూడా త్వరలోనే చేపట్టి రోడ్డు సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.



గోతులమయంగా ఉన్న జంపెన గ్రామం రోడ్డు

## సమాజ హితమైన సేవా కార్యక్రమాలే లక్ష్యం

▸▸ కమ్మ సామాజికవర్గ కార్యవర్గ సమావేశంలో గౌరవాధ్యక్షులు రమేష్‌బాబు

**కొత్తూరు, జూన్ 22 :** సమాజ హితమైన సేవా కార్యక్రమాలు చేయడమే తమ అసోసియేషన్ లక్ష్యమని కమ్మ సామాజికవర్గం అనకాపల్లి జిల్లా గౌరవాధ్యక్షులు కాకర్ల రమేష్‌బాబు అన్నారు. శనివారం ఇక్కడ జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పేద విద్యార్థుల చదువుకు సహకారం అందించేందుకు తీర్మానం చేశామన్నారు. త్వరలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. అసోసియేషన్ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ధనాల వెంగళరావు, పర్వతనేని శ్రీనివాసరావు, వీరమాచనేని శ్రీనివాసరావు, సూరిబాబు, పౌల్ట్రీ, క్రషర్స్ యూనియన్ ప్రతినిధులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.




## త్వరితగతిన పాఠ్య పుస్తకాల పంపిణీ

▸▸ ఎంఈవోల సమావేశంలో విద్యా శాఖ ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్

**అనకాపల్లి టౌన్, జూన్ 22 :** పాఠ్య పుస్తకాలను వెంటనే విద్యార్థులకు పంపిణీ జరిగేలా ఎంఈవోలు చర్యలు చేపట్టాలని విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు విజయ్‌భాస్కర్ సూచించారు. శనివారం ఇక్కడ విద్యాశాఖాధికారులతో జరిగిన సమీక్షలో మాట్లాడారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో కిట్లకు సంబంధించి ప్రతీ ఐటమ్‌కి ఒక్కొక్క ఇన్‌చార్జిని నియమించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని ప్రైవేటు పాఠశాలలకు పాఠ్య పుస్తకాల కొనుగోలుకు సంబంధించిన ఇండెంట్లు పెట్టాలన్నారు. ఆ మేరకు ఎంఈవోలు ప్రైవేటు యాజమాన్య పాఠశాలల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. గత విద్యా సంవత్సరం పాఠశాలలో ఉన్న అందరి పిల్లల ప్రొగ్రెషన్ ప్రక్రియను ఈ విద్యా సంవత్సరానికి పూర్తిచేయాలన్నారు. అధికంగా పెండింగ్‌లో ఉన్న ఎంఈవోలకు మెమోలు జారీ చేయాలని డీఈవోను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి రైస్, చిక్కీలు, గుడ్ల ఇండెంట్లు సమర్పించాలన్నారు. మండల విద్యాశాఖాధికారులు ఇద్దరూ నెలవారి పాఠశాలల పర్యటన షెడ్యూల్ సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈవో ఎం. వెంకటలక్ష్మమ్మ, డిప్యూటీ డీఈవో అప్పారావు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్, చిత్రంలో డీఈవో

### 'నీట్' నిర్వహణ లోపంపై ఆందోళన

**అనకాపల్లి టౌన్, జూన్ 22 :** దేశవ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించిన నీట్‌లో పెద్ద ఎత్తున జరిగిన అక్రమాలు, అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ నీట్ పరీక్షపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నా ఎన్డీయే ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడడానికే నిర్ణయించుకుందన్నారు. దేశవ్యాప్తంగా ఈ పరీక్షను మళ్లీ నిర్వహించాలని, జరిగిన అవకతవకలపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివాజీతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

### బాలికల కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**పరవాడ, జూన్ 22 :** ఇక్కడి బాలికల ప్లస్-2 కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైనట్టు ప్రిన్సిపాల్ శనివారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో విద్యార్థులు చేరేందుకు అవకాశం ఉందన్నారు. ఎంపీసీ గ్రూపులో 30 సీట్లు, బైపీసీ గ్రూపులో 20 సీట్లు ఖాళీగా ఉన్నట్టు చెప్పారు. పూర్తి వివరాలకు కళాశాల పనిదినాల్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

### 'పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి'

**ఎలమంచిలి, జూన్ 22 :** మునిసిపల్ అధికారులతో చైర్‌పర్సన్ రమాకుమారి శనివారం సమావేశమయ్యారు. మునిసిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో చర్చించారు. పారిశుధ్య నిర్వహణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా సూచించారు. వర్షాకాలం కావడంతో మున్ముందు వర్షాలు పడనున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

### వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో 'డాన్ టు డస్క్'

**పాయకరావుపేట, జూన్ 22 :** వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే డాన్ టు డస్క్ కార్యక్రమాన్ని శనివారం ఇక్కడ క్లబ్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అవయువాలు దానం చేసేందుకు ముందుకు వచ్చిన 16 మంది నుంచి అంగీకార పత్రాలు స్వీకరించడంతో పాటు పలువురికి సభ్యత్వం అందజేశారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఐ వి.అప్పలరాజుతో పాటు పోలీసులను సత్కరించారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మండవల్లి మురళీకృష్ణ కుమార్, రీజియన్ చైర్మన్ కంచెర్ల అశోక్‌కుమార్, సమయమంతుల శేఖర్‌బాబు, క్లబ్ అధ్యక్షుడు రాయపూడి జయప్రకాష్, కార్యదర్శి సత్యనారాయణ, ట్రెజరర్ నాని, పొలిశెట్టి మానస పాల్గొన్నారు.

### పచ్చదనం పెంపుతో కాలుష్య నివారణ

**నక్కపల్లి, జూన్ 22 :** కాలుష్య నివారణకు, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని ఎంఈవో కె.నరేశ్ కోరారు. చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్‌ఎం బి.కవితతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభమైన తరుణంలో ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద విధిగా మొక్కలు నాటాలని విద్యార్థులకు సూచించారు. వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, సర్పంచ్ చంద్రరావు, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్ల క్లబ్ అధ్యక్షుడు యేడిద వెంకట రమణ, పీఈటీ ఆదిలక్ష్మి, మాజీ సర్పంచ్ వెలగా శ్రీను, జనసేన నాయకుడు వెలగా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు చిత్తు

**సబ్బవరం, జూన్ 22 :** మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సెబ్‌సీఐ పి.దుర్గాప్రసాద్ సూచించారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. మత్తు పదార్థాలకు బానిసైతే భవిష్యత్ నాశనమవుతుందన్నారు. విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులై ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎస్ఐ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ గణేశ్, పీవీ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

### స్పీకర్‌ను కలిసిన పీలా

**తుమ్మపాల :** స్పీకర్‌గా ఎన్నికైన సీహెచ్. అయ్యన్నపాత్రుడ్ని విజయవాడలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద శనివారం కలిసి శుభాకంక్షలు తెలిపారు.




### వెంకటాపురంలో విద్యుత్ సమస్య

**రాంబిల్లి, జూన్ 22 :** వెంకటాపురం పంచాయతీలో లో వోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని మాజీ సర్పంచ్ సీరా వెంకటరావు శనివారం తెలిపారు. ఈ కారణంగా మోటార్లు పనిచేయక తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. లైట్లు, ఫ్యాన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తరచూ పాడవుతున్నాయన్నారు. అధికారులు వెంటనే స్పందించాలని కోరారు.

**పబ్లిక్ నోటీసు**

[illegible]

D.V.Viveikananda, Advocate, Tekkali, Cell : 9440436751










## CLASSIFIEDS

**FLATS FOR SALE**

★ **1050 sft.** North Facing with Car Parking, Lift @ Arilova, Near TIC Point. Contact: 7893944779, 9848549791 AJV_192956

**PLOT FOR SALE**

★ **SPOT REGISTRATION VMRDA & RERA** Approved Plots Sale @ Kothavalasa, Bhogapuram, Atchutapuram with all amenities. Ph: 9949233989 AJV_192957

★ **Vuda 269 Sq.yds.** West Facing, 50 ft. Road, Padmavati Nagar, Walkable to Vepagunta to Simhachalam 200 ft. BRTS Road. Cont.: **8309494629, 9885180930** AJV_183400

★ **SK Builders & Developers Beach Aero City.** VMRDA Approved Plots. L.P. No.37/2023. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకి అతి చేరువలో మరియు బీచ్‌కి ఆనుకొని 150 అ॥ రోడ్ ఫేసింగ్ * ఫ్యామిలీతో ఫారన్ ట్రిప్ * ఈ ఆఫర్ కొద్ది రోజులు మాత్రమే. బ్యాంక్ లోన్ సదుపాయం. సంప్ర॥ 9885535454 AJV_192970

**CHANGE OF NAME**

★ NAME CORRECTION : I, HEPSIBA GRACE CHATLA, W/O DAVID RAJU KALAPALA residing at D.No.31-47-153/2/2, Sri Vigneswara Nilayam, Sri Sai Nagar, Kurmannapalem, Visakhapatnam-530046, in my daughter's Xth CISCE certificate ID No.8150426 my name is wrongly mentioned as HEPSIBA GRACE KALAPALA instead of HEPSIBA GRACE CHATLA. My Correct Name is "HEPSIBA GRACE CHATLA" vide affidavit dated 21.06.2024. AJH-0349

**CHANGE OF NAME**

★ I, S P SANTHOSH KARRI, W/O. A. Siva Rama Krishna, D.No.50-83-10, Madhuranagar, Seethammapeta, Visakhapatnam. I have changed my name as A SAI PADMA SANTHOSHI. Hereafter my name is known as A SAI PADMA SANTHOSHI. AJH-0348

**RENT**

★ **2 BHK House 1200 sft.** 1st Floor, Rent 24 hr. Borewell & GVMC Watersupply Car Parking in Sector-7, MVP Colony, Officials only with Family. Cont.: 9148084213 AJV_192969

**LEASE / RENT**

★ **G+3 Floor** 5500 sft. Residential Space for Rent / Lease with 3 Car Parking, Lift. Opp. West Side VUDA 100 ft. Road, Madhurawada. Cont.: 9177791333 AJV_192553

**JOBS**

★ విశాఖపట్నం నందు లాడ్జి & రెస్టారెంట్‌లో పనిచేయుటకు రిసెప్షనిస్ట్, క్యాషియర్, బెల్‌బాయ్స్, వెయిటర్స్ కావలెను. ఫోన్: 9246234599. AJV_183399

**WANTED**

★ SOLAR TECHNICIANS & MARKETING EXECUTIVES ITI, DIPLOMA & B.Tech (ELECTRICAL) 2 YRS EXP. GM SOLAR SYSTEMS (TATA POWER SOLAR DEALERS) @ GUNTUR & HYD. Ph: 7075754209 AJH-275

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093


















## ఉపమాక వెంకన్నకు ప్రత్యేక పూజలు



నక్కపల్లి, జూన్ 22: ఉపమాక క్షేత్రానికి భక్తులు శనివారం పోటెత్తారు. తెల్లవారుజామున కొండపై ఉన్న స్వామి నిజరూపానికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.




# నేడు ఎమ్మెల్యే 'సుందరపు' విజయోత్సవ సభ



» అచ్యుతాపురంలో భారీ ఏర్పాట్లు » ఎంపీ సీఎం రమేష్ తదితరులు హాజరు

**అచ్యుతాపురం/ ఎలమంచిలి, జూన్ 22 :** ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ విజయోత్సవ సభ అచ్యుతాపురం మండల కాంప్లెక్స్ వద్ద ఆదివారం ఘనంగా జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సుందరపు వైసీపీ అభ్యర్థి యు.వి.రమణమూర్తిరాజుపై ఘన విజయం సాధించి, శాసన సభలో ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా నియోజకవర్గానికి రానున్నారు. ఆయనకు అఖండ స్వాగతం పలికేందుకు సర్వం సిద్ధం చేశారు. తొలుత ఆదివారం ఉదయం 7.30 గంటలకు ఎలమంచిలి మండలం ఏటికొప్పాకలోని బండి మాంబను ఆయన దర్శించుకున్న అనంతరం బైక్ ర్యాలీ ప్రారంభం కానుంది. లైన్ కొత్తూరు, ఎలమంచిలి మున్సిపాలిటీ, సైతారుపేట, వెంకటాపురం, సెజ్ పునరావాస కాలనీ, మార్టూరు మీదుగా అచ్యుతాపురంలోని మండల కాంప్లెక్స్‌కు చేరుకుంటారు. ఇక్కడ ఏర్పాటు కానున్న భారీ బహిరంగ సభలో విజయకుమార్‌తో పాటు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఇతర నాయకులు ప్రసంగించనున్నారు. ఇక్కడ ఏర్పాట్లను విజయకుమార్ సోదరుడు సతీష్‌తో పాటు జనసరెడ్డి శ్రీనివాసరావు, లాలం నాగేశ్వరరావు, గిరి రాజు, హరి రాజు, లాలం రమణ, కూనిశెట్టి రమణ తదితర నాయకులు పర్యవేక్షిస్తున్నారు.


అచ్యుతాపురంలో విజయోత్సవ సభకు ఏర్పాట్లు




## 'సెజ్‌లో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మించండి'

**అచ్యుతాపురం, జూన్ 22:** పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఇక్కడి సెజ్‌లో ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కార్మిక, పరిశ్రమల శాఖ మంత్రి సుభాష్‌ను కోరారు. అమరావతిలో శనివారం ఆయనను కలిసి సెజ్‌లో ఆసుపత్రికి స్థలం కేటాయించారని, పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు.

## డ్వాక్రా సంఘాలకు ఆడిట్ జరపాలని వినతి

**అనకాపల్లి టౌన్, జూన్ 22 :** జీవీఎంసీ పరిధిలోని అన్ని డ్వాక్రా సంఘాలకు ఆడిటింగ్ నిర్వహించాలని ఏపీడీవో దొరను టీడీపీ జిల్లా నాయకుడు బీఎస్ఎంకే జోగినాయుడు శనివారం కోరారు. కొంతమంది ఆర్పీలు సంఘ సభ్యులకు వారు కడుతున్న డబ్బులకు సరైన రశీదులు ఇవ్వడం లేదని పలువురు తమ దృష్టికి తీసుకు వచ్చినట్టు చెప్పారు.














## ఎంపీకి ఉద్యోగుల సంఘం సత్కారం



**కొత్తూరు, జూన్ 22:** అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌ను ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు, రిటైర్డ్ ఎంపీడీవో ఉప్పలపాటి కూర్మారావు శనివారం సత్కరించారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో సీఎం రమేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పీవీవీఎస్.ఎన్.రాజు, జలవనరుల శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అప్పలరాజు పాల్గొన్నారు.








సీపీఎం రాజకీయశిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

## 'కూటమి' ప్రజల ఆశలు నెరవేర్చాలి

» మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

**చోడవరం, జూన్ 22 :** రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం ప్రజల ఆశలు, వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా చర్యలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం రాష్ట్ర నాయకులు ఎంవీఎస్ శర్మ కోరారు. శనివారం స్థానిక కల్యాణ మండపంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సీపీఎం జిల్లా స్థాయి రాజకీయశిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఆధునీకరణ, చెరకు రైతుల బకాయిల చెల్లింపు, రహదారుల అభివృద్ధి, శిథిల వంతెనల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వంపై ప్రజలు అనేక ఆశలు పెట్టుకున్నారన్నారు. ప్రజల ఆశలు నెరవేర్చడంలో కానీ, ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో కానీ ప్రభుత్వం విఫలమైతే ప్రజాపోరాటాలు నిర్వహించడానికి తమ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉంటారన్నారు. ఈ సమావేశానికి జిల్లాలోని 24 మండలాల నుంచి నాయకులు హాజరయ్యారు.

ఈ శిక్షణ సమావేశంలో పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, సీపీఎం నాయకులు జి.కోటేశ్వరరావు, వీవీ శ్రీనివాసరావు, ఆర్. శంకరరావు, ఎస్వీ నాయుడు నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌గా అయ్యన్న.. టీడీపీ సంబరాలు


గొలుగొండలో సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నేతలు

**గొలుగొండ, జూన్ 22 :** రాష్ట్ర అసెంబ్లీలో నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పీకర్‌గా ప్రమాణ మహోత్సవం సందర్భంగా శనివారం మండల టీడీపీ నాయకులు పలు గ్రామాల్లో సంబరాలు నిర్వహించారు. మండలంలోని గొలుగొండ, జోగంపేటలో మిఠాయిలు పంచి బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, నాయకులు సీహెచ్ సాంబమూర్తి, సుర్ల బాబ్జీ, కమురవోలు చిట్టిబాబు, పుల్లేటికుర్తి రమేష్, గండేపల్లి రాము, రాయపురెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ అయ్యన్నను కలిసిన టీడీపీ నేతలు

**నాతవరం, జూన్ 22 :** శాసనసభ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు శనివారం ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో నాతవరం నుంచి పలువురు టీడీపీ నాయకులు అమరావతి బయలుదేరి వెళ్లారు. అయ్యన్న స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం కలిసి అభినందించారు. అమరావతి వెళ్లిన వారిలో తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, మాజీ ఎంపీపీ ఎన్.విజయ్‌కుమార్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు శెట్టి నాయుడు, అపిరెడ్డి మాణిక్యం, యర్రా కాశీ, బంగారు సూరిబాబు, జీరెడ్డి రాజుబాబు, శెట్టి నాయుడు, చింతకాయల శ్రీనువాసరావు సుర్ల నాగబాబు, గంగరాజు గొల్లు లోవరాజు తదితరులు ఉన్నారు.

**రావికమతం :** స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన అయ్యన్నపాత్రుడిని అమరావతిలో శనివారం కొత్తకోటకు చెందిన పలువురు టీడీపీ నాయకులు చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజుతో పాటు కలిసి వెళ్లి అభినందనలు తెలిపారు. అయ్యన్నను కలిసిన వారిలో టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబుతో, కొత్తకోటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కోట గోవిందరావు తదితరులు ఉన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



**మాడుగుల, జూన్ 22 :** మాడుగుల నుంచి ఘాటీ రోడ్డు వెళ్లే మార్గంలో తాచేరు దాటిన తర్వాత ప్రధాన విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతూ ఉన్నాయి. ఇటీవల వర్షాల పడుతున్న సమయంలో వీచిన ఈదురు గాలులకు ఇక్కడ విద్యుత్ స్తంభాల పై త్రీ వైర్ కేసారం క్లాంపు వదులుగా తయారయ్యాయి. దీంతో ఆ క్లాంపులకు అమర్చిన తీగలు కూడావదులుగా తయారై వేలాడుతూ కనిపిస్తున్నాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు భయాందోళనలకు లోనవుతున్నా రు. ఇక్కడకు కూతవేటు దూరంలోనే విద్యుత్ సబ్ స్టేషన్ ఉంది. అయినప్పటికీ ఈ తీగలను సరిచేయకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైె విద్యుత్ శాఖ సిబ్బంది స్పందించి స్తంభాలపై తీగలు సరిచేయాలని కోరుతున్నారు.

## ఘనంగా కల్యాణ వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో హోమపూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**మాడుగుల రూరల్, జూన్ 22 :** మండలంలోని కేజేపురం జంక్షన్‌లో కొలువైయున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 14 వ వార్షిక మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం నాగవల్లి సందర్భంగా పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రస్నానం తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా చేశారు. భక్తులు పూజాకార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేటి రామకొండరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు భక్తులు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



## స్పీకర్ అయ్యన్నకు ఆశీస్సులు.. అభినందనలు


స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులకు పురోహితుల ఆశీస్సులు


స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం అయ్యన్నను అభినందిస్తున్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

# హాస్టల్ తెరవక.. విద్యార్థినుల వెతలు

» 10 రోజుల కిందట మంచాల మోడల్ స్కూలు తరగతులు ప్రారంభం
» ఇళ్ల వద్ద నుంచి క్లాసులకు వస్తున్న విద్యార్థినులు
» తప్పని వ్యయప్రయాసలు


స్కూలు ప్రారంభమైనా తెరుచుకోని హాస్టల్


ఆటోలో పాఠశాలకు వెళుతున్న బాలికలు

**చీడికాడ, జూన్ 22 :** ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభమై పది రోజులు కావస్తున్నా ఇప్పటికీ పాఠశాలను ఆనుకొని ఉన్న మంచాల మోడల్ స్కూల్ హాస్టల్ ప్రారంభించలేదు. 9, 10వ తరగతులతో పాటు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం బాలికలు సుమారు వంద మంది వరకూ విద్యార్థులు ఉన్నారు. అయితే ఈ ఏడాది పదవ తరగతి పూర్తయినవారు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తయిన వారు మినహాయిస్తే 9 నుంచి 10వ తరగతికి వచ్చిన వారు, ఇంటర్ మొదటి నుంచి ద్వితీయ సంవత్సరానికి వచ్చిన సుమారు 50 మంది వరకూ బాలికలు హాస్టల్‌లో ఉండేందుకుసిద్ధంగా ఉన్నారు. అయితే విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ హాస్టల్ ప్రారంభించకపోవడంతో పలువురు బాలికలు తమ గ్రామాల నుంచి స్కూలు వస్తున్నారు. వీరు రోజూ ఆటోల్లో వస్తుండడంతో వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఆటోల్లో కిక్కిరిసి వస్తున్నామని, దీంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు వాపోతున్నారు. త్వరగా హాస్టల్ ప్రారంభించి బాలికలను ఇబ్బందుల నుంచి తప్పించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అయితే హాస్టల్ భవనంలో చిన్నచిన్న మరమ్మతులు చేపడుతుండడంతో హాస్టల్ ప్రారంభం ఆలస్యమైందని సిబ్బంది చెబుతున్నారు. సోమవారం నుంచి హాస్టల్ ప్రారంభిస్తామని చెబుతున్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రహీం

## 'మాదక ద్రవ్యాలకు దూరంగా మెలగాలి'

**గొలుగొండ, జూన్ 22 :** ఎప్పుడూ మాదక ద్రవ్యాలకు దూరంగాఉండాలని ఎన్‌ఫోర్సుమెంట్ ఎస్ఐ ఎస్ఎ రహీం విద్యార్థులకు సూచించారు. శనివారం బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల వచ్చే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రహీం మాట్లాడుతూ విద్యార్థి దశలో కేవలం చదువుపైనే శ్రద్ధ చూపాలన్నారు. కొందరు వ్యక్తులు నగదు ఆశ చూపి గంజాయి రవాణా చేపట్టేందుకు విద్యార్థులను ఉపయోగించుకుంటున్నారన్నారు. గంజాయితో పోలీసులకు పట్టుబడితే జీవితం నాశనం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్సుమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు

» ఎంపీడీవో పట్నాయక్

**కె.కోటపాడు, జూన్ 22 :** వర్షాకాలంలో వచ్చే అతిసారం, డయేరియా, మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా తదితర వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎంపీడీవో పట్నాయక్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, అంగన్‌వాడీ, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశాన్ని నిర్వహిం చారు. గ్రామాల్లో ఉన్న మంచినీటి ట్యాంకులను తరచూ క్లోరినేషన్ చేపట్టాలన్నారు. కొళాయిల ద్వారా వచ్చే నీటి శాంపుల్స్‌ను ప్రతి వారం తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ బ్లీచింగ్ చల్లాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న ఇంజనీరింగ్ సహాయకులు ప్రతి రోజు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. వ్యక్తిగత పరిశుభ్రత, నీటి నిల్వలు ఖాళీ చేయడంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జూలై ఒకటి నుంచి ఆగస్టు 31 వరకు రెండు నెలల పాటు ప్రతి గ్రామంలో ప్రచారం నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో పట్నాయక్

## లో-వోల్టేజీ సమస్య పరిష్కరించండి

» మాజీ ఎంపీపీ అప్పలరాజు

**మాడుగుల, జూన్ 22 :** మాడుగుల కేంద్రంలో గత కొన్నాళ్లుగా లో-వోల్టేజీ సమస్య ఏర్పడిందని, దీంతో చాలా ప్రాంతాల్లో గృహోపకరణాలు దగ్ధమయ్యాయని టీడీపీ నేత, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు పేర్కొన్నారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన మాడుగులలో లో-వోల్టేజీ సమస్య కారణంగా విద్యుత్ వినియోగదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యానికి మించి విద్యుత్ వినియోగం జరుగుతుందని, దానివల్ల లో-వోల్టేజీ విద్యుత్ హెచ్చు తగ్గులు అవుతోంద న్నారు. స్థానిక అర్జున్, గణేష్, నూకాలమ్మ, మోదమాంబ కాలనీలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో సరఫరా ఇబ్బందిగా ఉంటోందన్నారు. ఇప్పటికైనా ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అప్పలరాజు కోరారు.

## ప్రైవేటు వ్యక్తుల అజమాయిషీతో నష్టపోతున్నాం


» సకాలంలో సరుకు కొనుగోలు చేయడం లేదంటూ పామాయిల్ రైతుల ఆవేదన



కొనుగోలు చేయకుండా వదిలేసిన పామాయిల్ పంట చూపుతున్న రైతు

**రావికమతం, జూన్ 22 :** పక్వానికి వచ్చిన పామాయిల్ పంట కొనుగోలులో కంపెనీలు నిర్లక్ష్యం చేయడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రైతులు పండించినపామాయిల్ పంటను కొనుగోలుకు పెద్దాపురానికి చెందిన రుషీ ప్రైవేటు పామాయిల్ ఫ్యాక్టరీకి ప్రభుత్వ అనుమతులు ఇచ్చేవారు. ఈ ఫ్యాక్టరీ సూపర్‌వైజర్ పర్యవేక్షణలో రైతులుతెచ్చిన పామాయిల్ పంటను కొనుగోలు చేసేవారు. తమ పామాయిల్ తోటలోకి సూపర్‌వైజర్ వచ్చి చూసిన తరువాతే పంట కోసి అమ్మకానికి రావికమతం తీసుకొచ్చేవారిమని రైతులు తెలిపారు. అయితే పంట కోసిన రోజునే రైతుల నుంచి ఫ్యాక్టరీ యాజమాన్యం కొనుగోలు చేయాల్సి ఉన్నపటికీ గురువారం కోసిన పంటను శనివారం వరకు ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్ కొనుగోలు చేయలేదని రైతులు వాపోయారు.ఇలా రెండు రోజుల వరకూ రాలేదని, దీంతో తూకం తగ్గి రైతులకు తీవ్ర నష్ట వాటిల్లుతుందని ఓ పామాయిల్ రైతు మురళీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. పైగా అమ్మకానికి 600 కిలోల మేర తెచ్చిన పంటను పూర్తిగా ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్ తీసుకోకుండా 400కిలోలనే తీసుకొని మిగిలిన రెండు వందల కిలోల పంటను నాణ్యత లేదని కుంటిసాకులు చెప్పి పంటను కొనుగోలుకు నిరాకరించి వదిలేశారని వాపోయాడు. కంపెనీ ప్రతినిధులు పెద్ద రైతులు విషయంలో మాత్రం ఎలాంటి ఆంక్షలు పెట్టరని రైతులు అంటున్నారు. పామాయిల్ పంట విక్రయ సమయంలో ట్రాన్స్‌పోర్టుకాంట్రాక్టర్ల కాకుండా నేరుగా ఫ్యాక్టరీ సూపర్‌వైజర్ ద్వారా కొనుగోలు చేసేలా ఉద్యానశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## రోడ్డు పక్కనే చెత్తకుప్పలు


రహదారి పక్కనే ఉన్న చెత్త

**మాకవరపాలెం, జూన్ 22 :** పారిశుధ్య కార్మికుల కొరత కారణంగా మండల కేంద్రంలో అపరిశుభ్రత నెలకొంటోంది. ఒక్క మెయిన్ రోడ్డు తప్ప వీధుల్లో నెలల తరబడి కాలువలు శుభ్రం చేయడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువల్లో పూడికతో పాటు పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో కాలువుల్లో చెత్త పేరుకుపోతోంది. బీసీ కాలనీ, కొత్తవీధి, రాజారావుపేట, కిందవీధిలో చెత్తతో నిండి ఉన్న మురుగు కాలువలను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## 'ప్రభుత్వ స్కూళ్లలోనే ఉన్నత ప్రమాణాల విద్య'


కుసర్లపూడిలో నేను బడికి పోతా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**రోలుగుంట, జూన్ 22 :** ప్రభుత్వ బడుల్లోనే ఉన్నత ప్రమాణాలతో విద్య అందుతుందని హెచ్ఎం మోహన్‌రావు పేర్కొన్నారు. శనివారం కుసర్లపూడి జడ్పీ పాఠశాల ఆధ్వర్యంలో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యాప్రవేశం పేరుతో నెల రోజుల పాటు విద్యార్థులను చేర్చుకునే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉన్నత ప్రమాణాలు, ఆహ్లాదకరమైన వాతావరణం, స్నేహపూర్వక విద్యా విధానం ప్రభుత్వ బడుల్లో లభ్యం అవుతుందన్నారు. ప్రైవేటుకు దీటుగా అన్ని మౌలిక వసతులు ప్రభుత్వ బడుల్లో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల్లో చదువు ఆవశ్యకత వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పన రాంబాబు, బి.విద్యావతి, సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## 'డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్' కోసం పాడుపడాలి : ఎస్ఐ రహీం


అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ ఎస్ఐ రహీమ్

**కృష్ణాదేవిపేట, జూన్ 22 :** నాటుసారా తాగటం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతారని గొలుగొండ ఎస్ఈబీ ఎస్ఐ ఎస్‌కె రహీమ్ అన్నారు. శనివారం ఏఎల్‌పురం గొల్లవీధిలో 'డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్' అనే కార్యక్రమంలో భాగంగా ప్రజలతో ఎస్ఈబీ పోలీసులు, గ్రామస్థులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈబీ ఎస్ఐ ఎస్‌కె రహీమ్ మాట్లాడుతూ నాటుసారా, గంజాయి ఇతర మత్తుపదార్థలను సేవించి బంగారు యువత భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. గ్రామాల్లో నాటు సారా తయారు, విక్రయాలు, మద్యం బెల్ట్‌షాపు నిర్వహిస్తే ప్రజలు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాంబాబు

## డయేరియా ప్రబలకుండా చర్యలు

» ఎంపీడీవో రాంబాబు

**నాతవరం, జూన్ 22 :** గ్రామాల్లో డయేరియా రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో జె.రాంబాబు ఆదేశించారు. శనివారం ఆయన నాతవరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాంబాబు మాట్లాడుతూ మురుగు కాలువలో పూడిక తొలగింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలోనూ పారిశుధ్య మెరుగుకు కృషి చేయాలన్నారు. రోజూ చెత్త తొలగింపు, బ్లీచింగ్ చల్లడం వంటివి విధిగా చేపట్టాలన్నారు. రాష్ట్రంలో కొన్నిచోట్ల డయేరియా ప్రబలుతోందని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కొళాయిల దగ్గర మురుగు నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఏఎన్ఎంలు గ్రామాల్లో పర్యటించి ప్రజలు అనారోగ్య బారిన పడకుండా తగు ఆరోగ్య సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఈవోఆర్డీ మూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు

## కిశోర బాలికలకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డా.లూసీ కార్డియా

**మాకవరపాలెం, జూన్ 22 :** కిశోరబాలికలు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం డాక్టరు లూసీ కార్డియాతెలిపారు. శనివారం మండలంలోని పీపీఅగ్రహారంలో కిషోర్ బాలికలకు అందుతున్నవైద్య సేవలు, వారి ఆరోగ్య పరిస్థితులను ఆమె పరిశీలించారు. కిశోర బాలికలు, గర్భిణుల రక్తహీనత తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రక్తహీనత వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంకాధికారి ఏ.రామచంద్రరావు, డీపీవో జగదీష్, వైద్యాధికారి సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణుల సంఘ నూతన కార్యవర్గం


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ ప్రతినిధులు

**బుచ్చెయ్యపేట, జూన్ 22 :** మండల విశ్వబ్రాహ్మణుల సంఘాధ్యక్షుడుగా బిలకుర్తి నాగేశ్వరరావు, కార్యదర్శిగా కడియం శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుచ్చెయ్యపేటలోని రామాలయంలో శనివారం మండల విశ్వ బ్రాహ్మణుల సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా సంఘం అధ్యక్షుడు దిమిలి రాజేష్ ఎన్నికలాధికారిగా వ్యవరించారు. ఉపాధ్యక్షుడుగా ఎండపల్లి తులసీరావు, సహాయక కార్యదర్శి వంగలి నాగేశ్వరరావు, కోశాధికారిగా జి.నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా లక్కోజీ ఈశ్వరరావు, యండపల్లి నానిబాబు, చుక్కా సత్తిబాబు, పి.రాజారావు, చుక్కా సత్యనారాయణ, కోపోజీ సత్తిబాబు, జి.కన్నయ్య, యండపలి రాజులను సభ్యులు ఎన్నుకున్నారు. సమావేశంలో నియోజకవర్గం కన్వీనర్ చుక్కా వెంకట సత్యరాజు, కో-కన్వీనర్ పెదపూడి ప్రసాదరావు, గౌరవ అధ్యక్షులు లక్కోజీ నారాయణరావు పాల్గొన్నారు.

## 7 నుంచి జగన్నాథ స్వామి దశావతారాలు

**చోడవరం, జూన్ 22 :** వచ్చే జూలై నెల 7 నుంచి స్థానిక జగన్నాథస్వామి అవతార దర్శనం ప్రారంభం కానుందని కేశవస్వామి ఆలయ ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యులు తెలిపారు. వచ్చే నెల 5న శ్రీకేశవ స్వామి దేవాలయంలో జగన్నాథస్వామి పునఃప్రతిష్ఠ చేపడుతున్నామని, అనంతరం జూలై 18 వరకూ జగన్నాథస్వామి రోజుకో రూపంలో దశావతార దర్శనాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సుదర్శన సీతారామాచార్యులు కోరారు.

## నేడు కేపీ అగ్రహారంలో రక్తదాన శిబిరం

**బుచ్చెయ్యపేట, జూన్ 22 :** కేపీ అగ్రహారం నూకాంబిక దేవాలయం ఆవరణలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. చే-గు-వేరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి 3 గంటల వరకు నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.

## పవన్‌ను కలిసిన వీరసూర్యచంద్ర


పవన్‌తో సూర్యచంద్ర

**నర్సీపట్నం అర్బన్, జూన్ 22 :** అమరావతిలో శనివారం డిప్యూటీ సీఎం పవణ్‌కల్యాణ్‌ను నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సీపట్నం నియోజకవర్గం అభివృద్ధికి తప్పక కృషి చేస్తానని పవన్ చెప్పినట్టు వీరసూర్యచంద్ర చెప్పా రు. గ్రామ స్థాయిలో జనసేన పార్టీ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని పవన్ చెప్పారన్నారు.

## 54 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ గోవిందమ్మ

**చీడికాడ, జూన్ 22 :** మండలంలోని తంగుడుపల్లిలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఫ్యామిలీ ఫిజిషన్‌లో భాగంగా పెదగోగాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 54 మందిని తనిఖీ చేసి వారికి అవసరమైన మందులను డా.ధరణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వారికి పలు సలహాలు, సూచనలు అందించారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించు కోవాలని సూచించారు. ఇందుకోసం వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ గోవిందమ్మ, హెచ్‌వీ శకుంతల, ఏఎన్ఎం పద్మ, ఆశవర్కర్లు సేవలు అందించారు.

## క్రైం... crime news

### నాలుగు లారీలు సీజ్



సీజ్ చేసిన లారీలు

అచ్యుతాపురం, జూన్ 22: ఎటువంటి అనుమతులు లేకుండా రాళ్లను తీసుకు వెళుతున్న నాలుగు లారీలను సీజ్ చేసినట్టు సీఐ బుచ్చిరాజు తెలిపారు. అనకాపల్లి పరిసర ప్రాంతాల నుంచి భారీ రాళ్లను రాంబిల్లి మండలంలో నిర్మాణంలో ఉన్న ఎన్ఏఓబీకి రవాణా చేస్తున్నారు. లారీలకు సరైన రికార్డులు లేకపోవడంతోపాటు రాయి రవాణాకు మైనింగ్ అధికారులు నుంచి ఎటువంటి అనుమతులు లేవన్నారు. అధిక లోడుతో లారీలు వెళుతున్నా యన్నారు. సీజ్ చేసిన వాహనాలను మైనింగ్ డిపార్ట్‌మెంట్‌కి అప్పగించామని ఆయన తెలిపారు.

### పాము కాటుకు గురై మహిళ మృతి

దేవరాపల్లి, జూన్ 22: మండలంలోని బి.కింతాడకు చెందిన ఓ మహిళ పాము కాటుకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందిందని ఎస్ఐ డి.నాగేంద్ర శనివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బి.కింతాడకు చెందిన ఎలిశెట్టి లక్ష్మి (35) శుక్రవారం పొలం పని చేస్తుండగా ఆమెను పాము కాటు వేసింది. తన భర్త అప్పారావుకు ఫోన్ చేసి చెప్పడంతో ఆయన వచ్చేసరికే స్పృహ తప్పిపోవడంతో కె.కోటపాడు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఆమె భర్త అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## 'నీట్' నిర్వహణలో అక్రమాల నిగ్గు తేల్చాలి

» ఎస్ఎఫ్ఐ రాస్తారోకో... పరీక్ష మళ్లీ నిర్వహించాలని డిమాండ్




ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్, జూన్ 22 : దేశవ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించిన నీట్‌లో పెద్ద ఎత్తున జరిగిన అక్రమాలు, అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ పరీక్షను మళ్లీ నిర్వహించాలని, జరిగిన అవకతవకలపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివాజీతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## రత్నాచల్, జన్మభూమితోపాటు పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, జూన్ 22: దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్‌లో ట్రాఫిక్ బ్లాక్ పనులు చేపడుతున్న నేపథ్యంలో పలు రైళ్ల రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఈనెల 23 నుంచి ఆగస్టు పది వరకు మచిలీపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219), గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (07243), విశాఖ- లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805) రద్దు. ఈనెల 23 నుంచి ఆగస్టు తొమ్మిది వరకు తిరుపతి - విశాఖ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ (22708) రద్దు చేశారు. ఈనెల 24 నుంచి ఆగస్టు పది వరకు రాజమండ్రి - విశాఖ (07466), విశాఖ - రాజమండ్రి (07467), గుంటూరు- విశాఖ ఎక్స్‌ప్రెస్ (07239), విశాఖ- గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (172 40), విశాఖ - విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), విజయవాడ - విశాఖ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12718), విజయవాడ- విశాఖ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22702), విశాఖ- విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22701), విశాఖ- తిరుపతి డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ (22707) రద్దు. ఈనెల 24 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806), విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220), రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244) రద్దు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

**పలాస, గుణుపూర్‌తోపాటు పలు రైళ్లు...**

వాల్తేరు డివిజన్ పరిధిలోని పలాస, విజయనగరం మధ్య ట్రాఫిక్ బ్లాక్ పనులు జరుగుతున్నందున ఈనెల 24, 25 తేదీల్లో పలు రైళ్లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈనెల 24న పలాస-విశాఖ (07471), విశాఖ - పలాస (07470), విశాఖ-గుణుపూర్ (08522), గుణపూర్-విశాఖ (08421), విశాఖ-బ్రహ్మపూర్ (18526), విశాఖ-భువనేశ్వర్ ఎక్స్ ప్రెస్ (22820), విశాఖ - భవానీపట్న (08504) రద్దు. అలాగే ఈనెల 25న బ్రహ్మపూర్- విశాఖ (18525), భువనేశ్వర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (22819), భవానీపట్న-విశాఖ (08503) రద్దు చేశారు.

**రీ షెడ్యూల్ చేసిన రైళ్లు...**

కాగా పలు రైళ్లు ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేశారు. వీటిలో ముంబాయి - భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 23న మూడు గంటలు ఆలస్యంగా, ఈనెల 24న సంబల్‌పూర్- నాందేడు ఎక్స్‌ప్రెస్ (20809) గంట ఆలస్యంగా, షాలిమార్- సికింద్రాబాద్ ప్రత్యేక రైలు (07225) మూడు గంటలు ఆలస్యంగా, కోరాపుట్- విశాఖ పాసింజర్ (08545) మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరుతాయని పేర్కొన్నారు.

## అప్పన్నకు మూడో విడత చందనం సమర్పణ



చందన కిరీటంతో గోవిందరాజస్వామి

సింహాచలం, జూన్ 22 : వరాహలక్ష్మీనృసింహస్వామిని శనివారం తెల్లవారుజామున మూడో విడత చందనం సమర్పించారు. ఏటా స్వామివారికి 12 మణుగుల (500 కిలోల) శ్రీచందనపు ముద్దను పైపూతగా నాలుగు విడతల్లో సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. చందనోత్సవం అనగా వైశాఖ తృతీయ నాడు, వైశాఖ పూర్ణిమ నాడు మొదటి రెండు విడతల చందనాన్ని సమర్పించారు. జేష్ఠ మాస పూర్ణిమ పురస్కరించుకుని శనివారం వేకువజామున మూడో విడత చందనాన్ని సమర్పించారు. ముందుగా సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి 32 రకాల సుగంధ ద్రవ్యాల చూర్ణాలను మిళితం చేసి ఆలయ పద్మనిధిలో భద్రపరిచిన చందనపు ముద్దను వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి పైపూతగా సమర్పించారు. తొలుత అంతరాలయంలో మూలవిరాట్‌కు తరువాత స్వామివద్ద ఉండి నిత్య అరాధనలు స్వీకరించే యోగా నారసింహునికి, అనంతరం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి, లక్ష్మీనారాయణులకు చందనాన్ని కిరీటాలుగా అలంకరించారు.

## సమాజ హితమైన సేవా కార్యక్రమాలే లక్ష్యం

» కమ్మ సామాజికవర్గ కార్యవర్గ సమావేశంలో రమేశ్‌బాబు

కొత్తూరు, జూన్ 22 : సమాజహితమైన సేవా కార్యక్రమాలు చేయడమే తమ అసోసియేషన్ లక్ష్యమని కమ్మ సామాజికవర్గం అనకాపల్లి జిల్లా గౌరవాధ్యక్షులు కాకర్ల రమేష్‌బాబు అన్నారు. శనివారం ఇక్కడ జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లా డారు. పేద విద్యార్థుల చదువుకు సహకారం అందించేందుకు తీర్మానం చేశామన్నారు. త్వరలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. అసోసియేషన్ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ధనాల వెంగళరావు, పర్వతనేని శ్రీనివాసరావు, వీరమాచనేని శ్రీనివాసరావు, సూరిబాబు, పౌల్ట్రీ, క్రషర్స్ యూనియన్ ప్రతినిధులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | రూ.లలో |
| రైతు ధర | 125.00 |
| లైవ్ ధర | 145.00 |
| విత్ స్కిన్ | 260.00 |
| స్కిన్ లెస్ | 270.00 |

| కోడి గుడ్లు (నెక్) | |
|---|---|
| వంద గుడ్లు | రూ.లలో |
| విశాఖపట్నం | 520 |
| విజయనగరం | 524 |
| శ్రీకాకుళం | 524 |

# గోకులం షెడ్ల బిల్లుల కోసం ఎదురుచూపులు

» వైసీపీ అధికారంలోకి వచ్చాక నిధులు గోల్‌మాల్

» ప్రైవేటు సంస్థ ఖాతాలో నిధులు జమ

» వైసీపీ నేతలు, అధికారులు కుమ్మక్కై నిధులు స్వాహా చేశారని బాధితులు గగ్గోలు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించుకున్న రైతులు



శెట్టిపాలెంలో నిర్మించిన గోకులం షెడ్డు

మాకవరపాలెం, జూన్ 22:

**మినీ గోకులం పథకం కింద టీడీపీ హయాంలో రైతులు నిర్మించుకున్న గోకులం పశువుల షెడ్ల బిల్లులకు ఇప్పటికైనా మోక్షం కలుగుతుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.**

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018- 2019 ఆర్థిక సంవత్సరంలో మినీ గోకులం షెడ్ల పథకం అమలు చేసింది. ఈ నేపథ్యంలోనే సుమారు 180 షెడ్ల నిర్మాణానికి రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మూడు కేటగిరీల్లో షెడ్లను మంజూరు చేసింది. రెండు పశువులు ఉంటే వాటి నిర్మాణం కోసం రూ.లక్ష, నాలుగు పశువులు ఉంటే రూ.1.5 లక్షలు, ఆరు పశువులు అయితే 1.8 లక్షల రూపాయలు చొప్పున నిధులు కేటాయించింది. రైతులు అప్పట్లో పనులు ప్రారంభించి నిర్మాణాలు పూర్తిచేశారు. ఇంతలో ఎన్నికలు జరిగి వైసీపీ అధికారంలోకి రావడంతో రైతులకు బిల్లులు మంజూరు చేయకుండా వదిలేసింది. దీంతో మండల వ్యాప్తంగా రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్లకు కోటి 50 లక్షల రూపాయల బిల్లులు నిలిచిపోయాయి. నిర్మాణాల బిల్లులు చెల్లించాలని రైతులు పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. కలెక్టరుకు కూడా ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టరు విచారణకు ఆదేశించారు. జిల్లా పశు వైద్య శాఖాధికారులు విచారణ చేయగా, రైతులు నిర్మించుకున్న గోకులాల షెడ్లకు సంబంధించిన బిల్లులు జిల్లాకు చెందిన సాయి బాలాజీ అనే ప్రైవేటు సంస్థ పేరు మీద వైసీపీ ప్రభుత్వంలోనే జమ అయినట్టు తేలింది. ఇందులో భాగంగానే 2023 డిసెంబరు 25వ తేదీన మాకవరపాలెంలో గోకులాల షెడ్ల నిధుల స్వాహాపై విజిలెన్స్ డీఎస్పీ విచారణ చేపట్టారు. పలువురు రైతుల నుంచి వివరాలు సేకరించారు. అయితే ఇప్పటికీ సాయి బాలాజీ సంస్థపై చర్యలు తీసుకోలేదు. రైతులకు బిల్లులు కూడా మంజూరు కాలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టడంతో తమకు న్యాయం జరుగుతుందని రైతులు గంపెడు ఆశతో ఎదురుచూస్తున్నారు.

### వైసీపీ హయాంలో బిల్లులు నొక్కేశారు



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రెండు పశువులకు గాను షెడ్డు నిర్మించాను. అనంతరం ప్రభుత్వం మారింది. దీంతో బిల్లులు మంజూరు చేయాలని అధికారులకు స్పందనలో పలుమార్లు దరఖాస్తు చేసినా ఫలితం లేకపోవయింది. నాకు రావలసిన బిల్లును ఓ ప్రైవేటు సంస్థ పేరు మీద జమ చేశారని తెలిసింది. వైసీపీ నేతలు, అధికారులు కుమ్మక్కై రైతుల బిల్లులు కాజేశారు.

\- సుర్ల సత్యనారాయణ మూర్తి, కొండలఅగ్రహారం గ్రామం

# పాఠ్య పుస్తకాలను వెంటనే పంపిణీ చేయండి

» విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు విజయ్‌భాస్కర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్

అనకాపల్లి టౌన్, జూన్ 22: పాఠ్య పుస్తకాలను వెంటనే విద్యార్థులకు పంపిణీ జరిగేలా ఎంఈవోలు చర్యలు చేపట్టాలని విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు విజయ్‌భాస్కర్ సూచించారు. శనివారం జీవీఎంసీ పట్టణ బాలికోన్నత పాఠశాలలో విద్యాశాఖాధికారులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో కిట్లకు సంబంధించి ప్రతీ ఐటమ్‌కి ఒక్కొక్క ఇన్‌చార్జిని నియమించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని ప్రైవేటు పాఠశాలలకు పాఠ్య పుస్తకాల కొనుగోలుకు సంబంధించిన ఇండెంట్లు పెట్టాలన్నారు. ఆ మేరకు ఎంఈవోలు ప్రైవేటు యాజమాన్య పాఠశాలల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. 2023-24 సంవత్సరం పాఠశాలలో ఉన్న అందరి పిల్లల ప్రొగ్రెషన్ ప్రక్రియను 2024-25 సంవత్సరానికి పూర్తిచేయాలన్నారు. అధికంగా పెండింగ్‌లో ఉన్న ఎంఈవోలకు మెమోలు జారీ చేయాలని డీఈవోను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి రైస్, చిక్కీలు, గుడ్లు ఇండెంట్లు నిర్ణీత సమయానికి సమర్పించాలన్నారు. మండల విద్యాశాఖాధికారులు ఇద్దరూ నెలవారి పాఠశాలల పర్యటన షెడ్యూల్ సమర్పించాలని, ఆ ప్రాప్తికి సందర్శనలు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు బడిలో చేరని పిల్లల వివరాలు, మధ్యలో బడి మానేసిన పిల్లల వివరాలను అనుసరించి వారి ఇళ్లకు వెళ్లి సర్వే చేయాలన్నారు. తర్వాత వారిని బడిలో చేర్పించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో డీఈవో ఎం. వెంకటలక్ష్మమ్మ, డిప్యూటీ డీఈవో అప్పారావు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

## ఉపమాక వెంకన్నకు ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

నక్కపల్లి, జూన్ 22: మండలంలోని ఉపమాక క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. శనివారం తెల్లవారుజామున కొండపై వున్న స్వామివారి నిజరూపానికి అర్చకులు పూజలు చేసిన అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. కింద ఆలయంలో ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని పట్టుపీతాంబరాలు, పుష్పమాలలతో అలంకరించి బాలభోగ, రాజభోగ నివేదనలు చేశారు. ఆలయంలో హోమాలు చేశారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. భక్తులందరికీ ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఎంపీ సీఎం రమేశ్‌ను సత్కరించిన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు



ఎంపీ సీఎం రమేశ్‌ను సత్కరిస్తున్న ఉప్పలపాటి కూర్మారావు

కొత్తూరు, జూన్ 22: అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌ను ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు, రిటైర్డ్ ఎంపీడీవో ఉప్పలపాటి కూర్మారావు శనివారం సత్కరించారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో సీఎం రమేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పీవీవీఎస్.ఎన్.రాజు, జలవనరుల శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అప్పలరాజు పాల్గొన్నారు.

# కుర్చీ వదలరా?

» రిటైరైన తరువాత కూడా ప్రభుత్వ శాఖల్లో కీలక స్థానాల్లో కొనసాగుతున్న వారిని సాగనంపాలని ఆదేశాలు

» ఏయూలో అలాంటివారు బోలెడుమంది...

» వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా వర్సిటీ పాలకుల నిర్ణయాలు

విశాఖపట్నం, జూన్ 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పదవీ విరమణ తరువాత కూడా అనేకమంది ప్రొఫెసర్లు కీలక స్థానాల్లో కొనసాగుతున్నారు. రిటైరైన తరువాత కీలక స్థానాల్లో కొనసాగుతున్న అధికారులు, ఉద్యోగులు వెంటనే రాజీనామా చేయాల్సిందిగా ప్రభుత్వం ఈ నెల 20న ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో యూనివర్సిటీలో గడిచిన కొన్నాళ్ల నుంచి కొనసాగుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్లపై అందరి దృష్టిపడింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వీరంతా రాజీనామా చేస్తారా?, లేక ప్రభుత్వం బలవంతంగా తొలగించేంత వరకూ అలాగే ఉంటారా? అన్నది తేలాలి.

వర్సిటీలో రిటైర్డ్ ప్రొఫెసర్లను అనేక విభాగాలకు ప్రిన్సి పాల్స్, డైరెక్టర్లు, డీన్లుగా ఉన్నతాధికారులు నియమించారు. దీనిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అయినప్పటికీ పట్టించు కోలేదు. కొత్త ప్రభుత్వం ఈ నియామకాలపై దృష్టిసారించి రాజీనామాలు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఏయూలో పదవీ విరమణ తరువాత కూడా సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతూ వచ్చిన కె.శ్రీనివాసరావు, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భట్టి రాజీనామా చేశారు. వీరి స్థానంలో సీనియర్ ప్రొఫెసర్లను నియమిస్తూ ఏయూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. అయితే, ఇంకా అనేక విభాగాల్లో రాజీనామా చేయాల్సిన అధికారులు ఉన్నారు. వీరి వ్యవహారంపై ప్రస్తుతం వర్సిటీలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ వీరంతా ఇంకా కొనసాగుతుండడం గమనార్హం.

**జాబితా పెద్దదే..**

ఏయూలో పదవీ విరమణ తరువాత కీలక స్థానాల్లో చేరిన ప్రొఫెసర్ల జాబితా పెద్దదే ఉంది. వీరిలో ఓఎస్‌డీగా కొనసాగుతున్న ప్రొఫెసర్ కృష్ణమోహన్ ముందు వరుసలో ఉన్నారు. పదవీ విరమణ తరువాత మూడుసార్లు రిజిస్ట్రార్‌గా ఆయన కొనసాగారు. ఆ తరువాత కూడా ఆయన్ను వర్సిటీలోనే ఉంచేందుకు ఉన్నతాధికారి ఇప్పటి వరకూ ఎన్నడూ లేనివిధంగా ఓఎస్‌డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ)గా నియమించారు. ఇప్పటికీ అదే పోస్టులో ఆయన కొనసాగుతున్నారు. అలాగే, సోషల్ వర్క్ డిపార్టుమెంట్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా, విభాగాధిపతిగా పనిచేసి పదవీ విరమణ పొందిన ప్రొఫెసర్ విశ్వేశ్వరరావును దూర విద్యా కేంద్రం డైరెక్టర్‌గా నియమించారు. ఇదే కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన, యూనివర్సిటీకి సంబంధం లేని ప్రొఫెసర్ ఎంవీఎస్ చంద్రశేఖర్‌రావును నియమించారు. ఇదే కేంద్రంలో కీలక బాధ్యతలను ఆర్ట్స్ అండ్ కామర్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి పదవీ విరమణ పొందిన జి.సత్య నారాయణకు అప్పగించారు. అదేవిధంగా సోషల్ వర్క్ డిపార్టుమెంట్‌లో పదవీ విరమణ చేసిన ప్రొఫెసర్ శోభశ్రీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ ఇన్ ఎడ్యుకేషన్ (ఐఏఎస్ఈ) డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఇంజనీరింగ్ కాలేజీలో మరో రిటైర్డ్ ప్రొఫెసర్‌ను ఓఎస్‌డీగా నియ మించారు. సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ డైరెక్టర్‌గా మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నిరంజన్ కొనసాగుతున్నారు. వీరంతా పదవీ విరమణ తరువాత ఆయా స్థానాల్లో నియమితులై రెండు, మూడేళ్ల నుంచి కొనసాగుతున్నారు. వీరిలో ఒకరిద్దరు రాజీనామా చేసినట్టు చెబుతున్నారు. అయితే, ఇంకా బయ టకు రాలేదు. మరికొంతమంది అదే ఆలోచనలో ఉండగా, కొందరు మాత్రం ప్రభుత్వం తప్పించేంత వరకు వేచి ఉండాలని భావిస్తున్నట్టు తెలిసింది.

**వారి లెక్క తేలాల్సిందే..**

ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తనకు కావాల్సిన చాలామందిని కీలక స్థానాల్లో కూర్చోబెట్టారని, అస్మదీయులకు ఉద్యోగ కల్పన కేంద్రంగా వర్సిటీని మార్చారన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలోనే అనేక విభాగాల్లో గౌరవ ప్రొఫెసర్లు పేరుతో పదుల సంఖ్యలో రిటైర్డ్ ప్రొఫెసర్లను నియమించారు. అలాగే, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ పేరుతో అనేకమందికి అవకాశాలు కల్పించారు. వీరిపైనా ప్రభుత్వం దృష్టిసారించాల్సి ఉందంటున్నారు.

### ఏయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఎంవీఆర్ రాజు

» మహిళా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఆర్.పద్మశ్రీ



ఎంవీఆర్ రాజును సత్కరిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సైకాలజీ విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు నియమితులయ్యారు. శనివారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజుకు ఏయూ మాజీ వీసీలు ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు, శ్రీకాకుళంలోని అంబేద్కర్ విశ్వ విద్యాలయం మాజీ వీసీ ప్రొఫెసర్ రాంజీ, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నరసింహరాజు, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శశిభూషణ్‌తోపాటు ఇతర అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. సైన్స్ అండ్ టెక్నాలజీ కళా శాల ప్రిన్సిపాల్‌గా ఉన్న కె.శ్రీనివాసరావు రాజీనామా చేయ డంతో ఆయన స్థానంలో ఎంవీఆర్ రాజు బాధ్యతలు చేపట్టారు. అలాగే, మహిళా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సి పాల్‌గా ప్రొఫెసర్ ఆర్.పద్మ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు రావడంతో ఆమె శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఆ స్థానంలో కొనసాగిన ప్రొఫెసర్ కె.భట్టి రాజీనామా చేశారు.

## భారీ వర్షం.. చెట్టు పడి కారు ధ్వంసం





గైరంపేటలో కారుపై కూలిన భారీ వృక్షం

కృష్ణాదేవిపేట, జూన్ 22: గొలుగొండ మండలంలో పలు గ్రామాల్లో ఈదురుగాలులతో శుక్రవారం రాత్రి భారీ వర్షం పడింది. ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్ నాగాపురం, చోద్యం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. గైరంపేటలో ప్రధాన రహదారి అనుకొని ఉన్న భారీ చింతచెట్టు చర్చ్ పాస్టర్ అబ్రహం ఇంటిముందు నిలిపి ఉన్న కారుపై పడింది. దీంతో కారు దెబ్బతింది. విద్యుత్ స్తంభాలపై చెట్ల కొమ్మలు విరిగి పడడంతో తీగలు తెగిపడి సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

## సెజ్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మించండి

» మంత్రిని కోరిన ఎమ్మెల్యే సుందరపు



మంత్రి సుభాష్‌ను కలిసిన ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, జూన్ 22: పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం సెజ్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్లు, బీమా వైద్యసేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ని కోరారు. అమరావతిలో ఆయన శనివారం మంత్రి సుభాష్‌ని కలిసి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ఆర్థిక మండలిలో ఈఎస్ఐ ఆసుపత్రికి స్థలం కేటాయించారని, వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సెజ్ కర్మాగారాలు, ఇక్కడ కార్మికుల వసతి సౌకర్యాలు తదితర అంశాల గురించి విజయకుమార్ మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

## ఆరిలోవ రోడ్డు నాణ్యత పరిశీలన

» మూడు రోజుల్లో స్పీకర్‌కు నివేదిక అందిస్తామని ఆర్ అండ్ బీ డీఈ వెల్లడి



ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డును పరిశీలిస్తున్న ఆర్ అండ్ బీ డీఈ బాలసుందరబాబు

గొలుగొండ, జూన్ 22: ఆరిలోవ అటవీ ప్రాంతంలో నిర్మించిన రోడ్డు శాంపిల్స్‌ను క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది శని వారం సేకరించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ డీఈ బాల సుందరబాబు మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కోరిన సమాచారం మేరకు మూడు రోజుల్లో పూర్తి స్థాయి నివేదికను అందజేస్తామన్నారు. కృష్ణాదేవిపేట- నర్సీపట్నం మార్గంలో రాజులబాబు గుడి నుంచి పప్పుశెట్టిపాలెం మధ్యలో గత ప్రభుత్వ హయాంలో రూ.4 కోట్ల నిధులతో తారురోడ్డు నిర్మాణం జరిగిందన్నారు. దీనిని మూడురోజుల క్రితం నర్సీపట్నం ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పరిశీలించారన్నారు. నాణ్యత లేని రోడ్డు నిర్మించారని, బిల్లులు చెల్లించవద్దని ఆర్ అండ్ బీ శాఖాధికారులను ఆదేశించారని ఆయన తెలిపారు. దీనిపై పూర్తి స్థాయి నివేదిక అందించాలని ఆదేశించారని చెప్పారు. దీంతో మూడురోజుల్లో నివేదిక అందించేందుకు వివరాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ జేఈ ప్రసాద్, స్థానిక టీడీపీ నాయకులు అడిగర్ల అప్పలనాయుడు, సుర్ల బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.